# యోగించిన పుష్పాలు

## పులికంటి కృష్ణారెడ్డి

**ఊళ్ళో మనుషుల్ని నిద్రపోనీకుండా... పనీపాట చేసుకోనీకుండా... వారం దినాలు వరసబెట్టి మైకుల్లో ఊదరగొడ్తే ఆపూట కోనేటి కట్టకాడ ఆమాత్రం జనం చేరినారు.**

**కోనేటిలో మురుగునీళ్ళ కంపు ముక్కులు అదరగొడ్తా వుంటుంది. రాజకీయోపన్యాసాలు చెవులు అదరగొడ్తాయి. కోనేటి కట్టకాడ మీటింగుకు పొయ్యేడం టే — గోడ దెబ్బ చెంపదెబ్బ రెండు కొని తెచ్చుకున్నట్లే!**

ఈ రాజకీయాల మీటింగులకు, సినిమావాళ్ళ షూటింగులకు, పోలీసోళ్ళ లూటింగులకు నాకు పడదంటే కాసుకుపడదు. దోవన పొయ్యే జగడం ఇంటి దాకా ఎందుకు? నా ఇల్లు నాకుంటే!

అంతేగదా మరి! ఎట్నో ఒకట్లా కూడేసింది కూడివంత వుండాది. పని చేసినా చెయ్యకపోయినా మూడు పూటలు నాలుగువేళ్ళు వద్దన్నా లోపలికి పోతాయి. అందువల్ల అట్టా ఇట్టా అడ్డగాడిద మాదిర గాలికి తిరిగేసి వచ్చి ఇంట్లో అట్టా అడ్డం పడ్తే చాలు. కూతురు కులకతా వచ్చి మనవణ్ణి కడుపు మీద పండేస్తుంది. వాడా చిన్న సైజు బాన టెన్నిస్ కోర్టే అనుకుంటాడేవో? కాసింతసేపు అడ్డెగిరి ఇడ్డెగిర దూకి ఆఖరికి కొళాయి విప్పేస్తాడు. గుడ్డలు తడిసిపోతున్నయని నా బాధ. వాడి ఆనందం వాడిది. తన అయ్యమీదనే ఉచ్చలు పోస్తున్నాడన్న తృప్తి కూతురిది. అప్పుడు రంగ ప్రవేశం చేస్తుంది వాడి అమ్మమ్మ — 'యదవా? ఎంత పని చేస్తావుండావురా?' అని.

చిన్న బిడ్డలంటే దేవుళ్ళు గదా? అందరు భయపడేది ఆ దేవుళ్ళను చూసే గదా? ఇంక వాడికేం భయం?



ఇంతకు మించిన అనుభవం...! ఇంతకు మించిన అనుభూతి వుంటుందా! ఓహోహో! ఈ సంఘటన ఎంత గొప్పది? అవగాహనచేసుకుని ఆవిష్కరించగల శక్తి వుండాల్నే గానీ — మునిసిపాలిటీ కొళాయిల్లో నీటి బొట్టుకోసరం నిలబడి ఆ మీదట కలబడి నిట్టూర్పుల పొగలు సెగలు కక్కుతున్న రాయలసీమలో నా మనవడు అయాచితంగా కొళాయి తిప్పేయడమంటే? ఆలోచించాల్నే గానీ ఇట్లా ఎంతైనా విశ్లేషించి చెప్పకోవచ్చు గదా! ఇది విడిచిపెట్టి మీటింగులని...షూటింగులని... లూటింగులని తలకొట్టుకునే దెందుకు? నాకు తెలిసింది నాకు తెలుసు. నాకు తెలిసిందే నేను రాస్తాను.. చదివినవాడు చదవతాడు. వద్దనుకున్నవాడు వదిలి పెడ్తాడు. అంతేగదా అంటే — మా వెంకటసుబ్బయ్య...

"ఒరే అబ్బోడా! ఈ సమాజానికి దేవుడి పేర... మంతం పేర జరిగే అన్యాయాలకంటె మీలాంటివాళ్ళ వల్ల జరిగే అన్యాయమే ఎక్కువ. మీరంతా ఇంకా అయిదు వందల ఏండ్ల కిందటినాటి తలకాయల్తోనే ఆలోచిస్తా వుండారు!" అని మాటి మాటికి మిరాయి చప్పరిస్తాడు.

"అయితే ఈనాటి తలకాయలైతే ఎట్లా ఆలోచిస్తాయ్!" అని అడిగితే —

"ఈ వ్యవస్థను సృష్టించింది దేవుడు కాదనీ... మతం మారణహోమాలకు దారితీయకూడదని ఆలోచిస్తాయి. కనీస సామాజిక పరిజ్ఞానం లేనివాళ్ళంతా రచయితలేనా? నిజంగా రచయితల్లో ఆ మాత్రం పరిజ్ఞానమే వుంటే ఇప్పటి పరిస్థితుల్లో ఎంత గొప్ప 'సెటైరికల్ లిటరేచర్' వచ్చేది. ఎక్కడ? రాలేదే?" అని ఆవేశపడతాడు.

బతికిపోయినాను. బట్టతల వచ్చేసింది. లేకుంటే వాడిసి జుట్టుపట్టి వాటంగా పైకెత్తి పట్టుకుని ఆ ఆవేశంతో ఈ చెంపా ఆ చెంపా వాయించేవాడేమో? అతడికా అవకాశం నా అదృష్టవశాత్తు దక్కలేదు కాబట్టి గడ్డం పట్టుకుని బతిమాలుతున్నట్టుగా ఆవేదనపడ్డాడు. 'రచయితలకు కనీస సామాజిక పరిజ్ఞానం వుండాలయ్యా!' అని.

అదో! అందుకే ఆ పొద్దు కోనేటికట్టకాడ మీటింగ్‌కు పోయినాను — అక్కడ కాసింత సామాజిక పరిజ్ఞానాన్ని మూటగట్టి తెచ్చుకొందామని!

ఆ కోనేటిని కట్టించినవాళ్ళు కట్టించినారు. దానికి గోవిందరాజస్వాములవారి పుష్కరిణి అని పేరు పెట్టినవాళ్ళు పెట్నారు. ఎంత పుణ్యం దక్కిందో? ఏమో? మూటలు గట్టుకున్నారు. భక్తులు ఆ పుష్కరిణిలో తమ తమ పాపాల్ని కడిగేస్తున్నారు. అదిగూడ ఎంతకాలమని భరిస్తుంది? ఎంతని భరిస్తుంది? అది ఎండిపోయింది. దినదినానికి భక్తి ఎక్కువైపోతుంటే అది మాత్రం ఎండిపోక ఏంచేస్తుంది?

ఇప్పుడు అడుగంటి... అక్కడక్కడ బురదగుంటలేర్పడి... తాడు విడిచిన బొంగరాలు తమ ఇష్టమొచ్చినట్టు వాడుకుంటూ వుండే చెడ్డ కంపు కొడ్తా వుంటుంది. ఇప్పుడు గోవిందరాజస్వామి పుష్కరిణిలో ప్రజలు



పార్టీవాళ్ళు కరెంటు లేకుండా జేస్తే?' తడుముకోకుండా అన్నాడతడు.

'ఓహో! ఇటువంటి గొప్ప పనులు కూడా జరుగుతుంటాయన్నమాట' అని అంటే — 'ఈళ్ళ మీటింగప్పుడు వాళ్ళు కరెంటు లేకుండా జేస్తే — వాళ్ళ మీటంగప్పుడు ఈళ్ళు బాంబులే యేస్తారు' అని అందుకున్నాడు ఇంకొకడు.

అది ఎన్నికల ప్రచారంకోసరం ఏర్పాటైన మీటింగ్!

అనుకున్న టయానికి అటొస్తే ఇటొస్తేగా నాయకులు వచ్చినారు. మీటింగు మొదలయింది. పూలమాలలు వేయడం... చప్పట్లు కొట్టడం... ఎవరి పద్ధతిలో వాళ్ళు రాజకీయ ఉపన్యాసాల్లో మునిగి తేలుతున్నారు.

ఆ పొద్దు ఆ కోనేటికి నాలుగు మూలల్లో నాలుగు శబ్దప్రసారక యంత్రాల్ని అమర్చి — ఒక మూల పెండ్లికో పేరంటానికో కట్టినట్టు పెద్ద వేదికను కట్నారు. ఆ వేదికను రంగు రంగు బల్బుల్తో అలంకరించినారు. ఆ బల్బులు మత్తేబుసు చుట్టుముట్టిన కొర్కెల్లాగ వెలిగిపోతున్నాయి. వేదిక మీద అందమైన అయిదారు కుర్చీల్ని అమర్చినారు. ఇవి కుర్చీల సిగపట్ల రోజులు. అందుకే కుర్చీలకు పేర్లు రాసిన అట్టముక్కల్ని అతికించినారు. పాపం! వాళ్ళభయంవాళ్ళది. ఆ పక్కన్నే అరడజను పెట్రొమాక్స్‌లైట్లు కూడా వెలిగించి పెట్టినారు. 'దేదీప్యమానంగా విద్యుద్దీపాలు వెలిగిపోతుంటే మధ్య దిష్టి చుక్కల్లాగా యివెందుకు?' అని ఎవరినో అడిగితే 'మీటింగ్ జరగతా వుండేటప్పుడు ఆపోజిట్టు ఇంకొక పార్టీ అవకతవకల్ని ఎత్తిపోయడం! అంతే గదా మరి! ఈ దేశంలో వాళ్ళనుంచి అంతకంటే ఆశించడం మేక మెడ కింద చన్నుల్ని ఆశ్రయించినట్లే గదా? అని ఆలోచిస్తున్నాను. అప్పుడు ఒక వ్యక్తి పైకి లేచి నాడు. అతడు లావుగా, లంబుగా వున్నాడు. లావుకు, లంబుకు తగినంత హుందాగా వున్నాడు. మనిషి తొణక్కుండా... బెణక్కుండా... చాలా మట్టసంగా... నిందారోపణలకు తావు లేకుండా తాను పదవిలో వున్నప్పుడు ఈ రాష్ట్రానికి చేసిన సేవల్ని గురించి మాత్రమే లెక్కాచారంగా మాట్లాడినాడు. లెక్కగట్టి చూపించినాడు. అంతా విన్నారు. విని ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారు.


నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆశ్చర్యం అంటే అంతా ఇంతా కాదు — ఆ కోనేరంత. 'ఇంత సహాయం చేసినానంటే ప్రతిస్పందించాల. లేకుంటే ప్రతిఘటించాలి. అదేమీ లేకుండా బెల్లంకొట్టిన రాళ్ళమాదిరి కూర్చున్నారు. చెప్పినదంతా విన్నారు. మీటింగ్ అయిపోతానే లేచి వెళ్ళిపోయినారు. మంచివాళ్ళంతా అదే పని చేస్తుంటారు.

బుద్ధుడికి జ్ఞానోదయం కలిగింది. ఇల్లొదిలి పెట్టినాడు. నేను ఇల్లు చేరినాను.

ఆ రాత్రి నాకు నిద్రపట్టకపోవడానికి కారణం — చెవులదగ్గర సంగీతం వినిపిస్తున్న దోమలే కాదు — ఆ పొద్దు కోనేటి కట్టకాడ కలిగిన జ్ఞానోదయం కూడా పూర్తిగా కాకపోయినా పాక్షికంగా బాధ్యత వహించిన మాట సత్యదూరం కాదు.

ఆ మరుసటి దినం అడ్డగాడిదల శ్రుతిలో అదరగొడ్తున్న మైకులు నన్ను నిద్రలేపినాయి. ఈ మధ్య ఈ మైకుల గొడవ కాసంత ఎక్కువయింది. బ్రాందీ అమ్ముకోవచ్చు కానీ ప్రచారం చేయకూడదు. ఆరోగ్యానికి మంచిది కాదని ప్రకటిస్తూ సిగరెట్లు అమ్ముకోవచ్చు, త్రాగవచ్చు. ప్రచారం కాదు. అన్ని అంటానే ఫలానా బార్లో మంచి మాంసాహారం దొరుకుతుందంటే — అక్కడ మందుకూడా దొరుకుతుందని తెలిసిపోతున్నది కదా? మైకుల్లో ఈ గొడవలన్నీ రోజు శ్రావ్యంగా చెవినపడ్తే ఆ దినం మైకులు మాత్రం గుబ అదరగొడ్తున్నాయ్. జాగ్రత్తగా వింటే తేలిందేమంటే — ఆ మరుసటి రోజు కోనేటి కట్టకాడ మీటింగని!

మీటింగుకు పోవడమంటే దుడ్డూ దుగ్గాణి లేనిపని కదా? అని సకుటుంబసమేతంగానే పోదామనుకున్నాను.




అయితే, మీటింగ్‌కు రెండు గంటల ముందుగానే మాస్తే — కుటుంబం ఎక్కడుంది? కోనేటికట్టకాడ తావు కోసరం తారట్ల వుంటుంది. ఆడవాళ్ళను 'అంత గొప్పగా ఆకట్టుకున్న ఆనామకుడికి శ్రద్ధాంజలి... పొర బాటు! శ్రద్ధతో కూడింది శ్రద్ధాంజలి అనుకోవడం తప్పు కదా? అందుకని వట్టి అంజలి ఘటిస్తూ కోనేటి కట్టకాడికి నడిచినాను.

నాకున్నవి రెండు. ఇక్కడున్నవి వెయ్యి. 'బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది. ఆ కన్నులెన్నంత సేపు? — ఈ మీటింగ్ అయిపోయేదాక స్పేర్ చెయ్యి!' అని బతిమలాడి వెయ్యి కండ్లు అప్పతెచ్చుకున్నా — వెయ్యిన్నీ రెండు కండ్లు ఏ మూలకు? — ఆదిశేషుణ్ణే కాదు — వాడమ్మా మొగుడైనా సరే — వర్ణించనయ్యా అంటే? వల్లకాదనాల్సిందే! అది మీటింగ్ కోసరం తయారైన వేదిక అనడం కంటే మహారాజా దర్బార్ అంటే సరిపోతుంది.

నాలుగు చినుకులు రాల్తే ఈసుళ్ళు లేసినట్టు కోనేటి కట్టమీద... మెట్లమీద... చుట్ట పక్కల మిద్దెలమీద... మేడలమీద ఎక్కడ చూసినా జనం! తిరుపతి గంగమ్మ జాతర కోసరం ఊరూరి నుంచి వచ్చి చేరిన జాతర జనం మాదిర జనం... ఇసికేస్తే రాలని జనం... పొద్దు వాలినప్పటినుంచి ఎదురు చూస్తా కూర్చున్నారు.

సరే అతడు ప్రజానాయకుడు.

ఆ నాయకుడికి ప్రజలు తన వాళ్ళని తెలుసు. వాళ్ళు తన వాళ్ళు కాబట్టే తాను రావలసినప్పుడు కాదు — రాగలిగినప్పుడే వచ్చినా తనకోసరం ఎదురు చూస్తా వుంటారని కూడా తెలుసు. అందువల్ల నాయకుడు ప్రకటించిన వేళకు రాలేదనుకోవడం పొరబాటు. ఆ నాయకుడు రాగలిగినప్పుడే వస్తాడు. ఈ మంద తప్పకుండా తనకోసరం ఎదురు చూస్తా వుంటుందని!

అప్పుడు వున్నట్లుండి నాయకుడు గెవినిలో అడుగు పెట్టాడన్న వార్త గుప్పుమనింది. జనం పాలోమని పైకి లేచినారు. నిక్కినిక్కి చూస్తున్నారు. నిక్కినిక్కి చూసే వాళ్ళకంతా మెడలున్నాయి. అవి బరువులు మోసిమోసి అలవాటుపడిన మెడలు. అందువల్ల నిక్కి నిక్కి చూడడమంటే — వాళ్ళకు బాగా అలవాటయిన పని అది. అయినా చూసినంతసేపు చూసినారు. హుషారుగా పైకి లేచిన వాళ్ళు ఉసూరుమంటూ కూర్చున్నారు. వాళ్ళు కూర్చోవడంలో తెలిసింది నాయకుడు రాలేదని!


గ్రామ్స్: పెండోట
ఫోన్: 4461

PVR

M/S పెండోట వెంకటరత్నం
వెండి వ్యాపారం; పెండోట మాన్షన్, కొత్తపేట, తెనాలి
గత 60 సం॥లుగా ఆంధ్రదేశంలో పేరెన్నికగల PVR
వెండివస్తువులు నాణ్యతకు మారు పేరు. ప్యూరిటీ (P) వెరైటీ (V)
రాయల్టీలకు (R) PVR ట్రేడ్‌మార్కు నమ్మకమైన పేరు.
అన్నిరకముల వస్తువులూ ఆర్డర్లపై తయారుచేయు
ఏకైక నాణ్యమైన వ్యాపారస్తులు. PVR
ఒకసారి విచ్చేయండి. మీ వస్తువులకు పూర్తివిలువను ఇవ్వండి
—ప్రొ॥ కె. రవీంద్ర ప్రసాద్.

P.S: మాకు రిప్రజెంటేవులు గానీ, మరే విధమయిన బ్రోకర్లు గానీ లేరు.
మా పేరు చెప్పి ఇచ్చిన వెండి వస్తువులను తీసుకోవద్దు. పరీక్షించి తీసుకోండి.

SANDILYA

అట్ల మలగులాలు పద్తున్న సమయంలో ఒక అంద మైన కారు... ఆ కారుకు ముందు ఎన్నికార్లున్నాయో? వెనుక అంతకు మూడింతలుగా కార్లున్నాయి. అక్కడ ఆగింది అంత అందమైన కారు తమ నాయకుడికి తప్ప మరొకరికి వుండడానికి వీల్లేదని ఆ జనానికి తెలుసు. అందుకే ఒక్కసారిగా ఈలలు... చప్పట్లు... జయ జయ నినాదాలు!

వాళ్ళ అంచనా తప్పు కాలేదు. అందాల కారులో నుంచి వాళ్ళ అందాల నాయకుడే దిగినాడు. ఆ నాయకుణ్ణి నడకోకల మీద నడిపించినారు. దిగదీసి టెంకాయలు కొట్నారు. ఆడపడుచులు హారతులెత్తి నారు. శోభనం గదిలో కూడా వాళ్ళ మొగాలంత శోభాయమానంగా వెలిగి వుండవేమో?

ఇట్లా చెప్పాలంటే - ప్రజానాయకుడు కారుదిగి... ఎదురైన ముఖ్యుల్ని పరామర్శించి... వేదిక మీదకెక్కి ఆ వేదిక ముందు భాగాన నిలబడి... అశేషప్రజానీకాన్ని చూస్తూ... చిరునవ్వులు చిందిస్తూ... ఎడమ చెయ్యెత్తి అభయమివ్వడం వరకు చాలాచాలా చెప్పవచ్చునుగానీ — అసలుకంటే వడ్డీ ఎక్కువైపోతుందన్న భయంతో అసలు విషయానికి వస్తే...

'ఇప్పుడు మన ప్రియతమ నాయకుడికి పూల మాలల కార్యక్రమం' అని ఒకడు మైక్‌ను గట్టిగా పట్టుకుని మైకంలో పడినట్టు అంతకన్నా గట్టిగా పేరు ప్రకటిస్తూ వుంటే — బారెడు పొడుగు పూలమాల చేతబట్టి అరకిలో మీటర్ క్యూలో నిలబడిన పేరు దారుడు ఆదరాబాదరా వచ్చి పూలమాల లేస్తుంటే... వేసిన పూలమాలలను ఒకరు తీస్తుంటే... ఇంకొకరు అందుకుని పక్కన వేస్తుంటే అక్కడింక పూలమాలల గుట్ట పడింది.

నాయకుడు వాటివైపు క్రీగంట చూస్తూ చిరునవ్వు నవ్వినాడు.

అప్పటికి పూలమాలల ప్రహసనం ముగిసింది.

కాలాతీతం కావడం మూలాన జాబితాలోని ఉప న్యాసకులు తమంతట తాముగా ఉపసంహరించు కున్నారు. అంత గొప్ప త్యాగాన్ని తమ నాయకుడు గుర్తిస్తారనుకున్నారు. ఇంత చిన్న విషయాల్ని గుర్తుపెట్టుకుంటూ పోతే అతడు నాయకుడు ఎట్లాఅవుతాడు? ఆ సంగతి వాళ్ళకు కూడా తెలుసుకాబట్టి ప్రియుడిచేత దెబ్బలుతిన్న ప్రియురాలి మాదిరి అప్పటికి సర్దుకున్నారు. సర్దుకుపోయేతత్వం మన జన్మహక్కు కదా?

వేదిక ప్రియతమ నాయకుడి కొక్కడికే అంకిత మయింది పదవి అంకితమైనట్లు! నాయకుడు పైకి లేచినాడు. చప్పట్లు...! సద్దు సద్దు అన్నట్లుగా ఎడమ చెయ్యి పైకెత్తి గాలిలో ఊపినాడు... చప్పట్లు... గొంతు సవరించుకున్నాడు. చప్పట్లు! అమ్మలగన్న అయ్యల్లారా! అయ్యలగన్న అమ్మల్లారా! అన్నాడు. చప్పట్లు...!

అంతకుమించిన సామాజిక పరిజ్ఞానం అజీర్తికి కారణమవుతుందన్న భయం ఆవరించింది నన్ను. ఆ జనం లోనుంచి బయటపడడం — తల్లి గర్భంలో నుంచి బయటపడినవాణ్ణే కదా? అయినా చాలా ప్రయాస పడవలసివచ్చింది. తల్లిగర్భంలోనుంచి బయటపడి' నప్పుడు పొదుపులో — ఇప్పుడేమో చప్పట్లలో...

మొన్నటికి, ఈనాటికీ ఎంత తేడా? పండువొలిచి చేతిలో పెట్టినట్టు పరిస్థితుల్ని అదమరిచి చేతుల్లో పెడ్తే స్పందించని జనం... ముక్కితే... మూలిగే... కదాన ముద్ది తప్పితే చేతులు తట్టుతున్నారా?

వెంకటసుబ్బయ్య చెప్పిన దాంట్లో తప్పేమీ లేదు. ఈ తలకాయలన్నీ అయిదు వందల ఏండ్ల కిందటి నాటి తలకాయలే. అందుకు సందేహం లేదు! అని నా తల కాయతో ఆలోచిస్తూ నడుస్తున్నాను. చెప్పవచ్చునో? చెప్పకూడదో? కాని చెప్పేస్తున్నాను. తప్పయితే క్షమిం చండి? అని అడగడమెందుకు? తప్పుల్ని క్షమించడంలో మనకన్నా మొనగాళ్ళున్నారా? లేరు. ఆ ధైర్యంతోనే చెప్పేస్తున్నా!

చంద్రగిరికోట వుంది. ఆ కోటలో రాజమహల్ వుంది. ఆ రాజమహల్ విజయనగర సామ్రాజ్య వైభవ ప్రాభవాల్ని పండించిన కృష్ణరాయల గృహమట. శ్రీ వేంకటేశ్వరుని సందర్శనార్థం ఆయన సపరివార సమేతంగా తిరుపతి క్షేత్రానికి విచ్చేసినప్పుడు చంద్రగిరి కోటలోని రాజమహల్‌లోనే విడిది చేసేవారట!

ఆ విధంగా రాయల వారు చంద్రగిరి కోటలో విడిది చేస్తున్న ఒకానొక సందర్భంలో — పొద్దు వాటారిన వేళ... బంగారు కాంతుల్ని పులుముకుంటున్న కోట రాజదర్పంతో దర్జాలు పోతున్న వేళ... రాజానుగ్రహాన్ని పొందడానికి చేతులు కట్టుకుని నిలబడిన అందగత్తెల్లా కోట ముందర కోనేరులో తామరలు మూతులు ముడుచుకోవడానికి మొంపుతున్న వేళ... రాయలవారు రామలింగ కవిగారితో కలిసి రాజమహల్ పై భాగాన కూర్చొని పెత్తనాలు పడుతున్నారట! ఆ సమయంలో రాయలవారు వున్నట్లుండి 'రామలింగయ్యా! అటు చూడు!' అన్నారట.

రామకృష్ణ కవి చూసినారు.


పూరెమ్మల్ని చేర్చి గుడికట్టినట్టుగా వున్న గుంపు... అందగించుకున్న వందమంది వనితలు... అలికి పసుపు పూసి కుంకుమ బెట్టిన పొంగలి గంపలు... ఒక్కొక్కరి నెత్తిమీద ఒక్కొక్క గంప!... పలకలు... పంచలు... కొమ్మలు నుంచి దరువులు పోతున్నాయి. వీచే గాలికి కొమ్మలు కదిలినట్టుగా పొంగలి గంపలు నెత్తి నెత్తుకున్న మగువలు కదులుతున్నారు.

రామలింగ కవి చూపులు మరల్చకుండా అటువైపే చూస్తున్నారు.

"ఇంతమంది ఈ విధంగా ప్రభావితం కావాలంటే - ఆ తల్లి చంద్రగిరి మూలస్థానమ్మ మహిమలే కదా కారణం. ఈ జాతి నరనరాల్లో జీర్ణించుకుపోయిన దైవ భక్తే — మనల్ని కాపాడుతుందనుకుంటాను" ఒక రకమైన స్ఫూర్తిలో తేలిపోతూ అన్నారట రాయలు.

"ఇదంతా గొర్రె దాటులే మహారాజా!" అని నోరు చప్పరించినాడట కవిగారు.

రాయలవారి కనుబొమ ముడిపడింది!



"అపార్థాలు తీయడం కవిగారికి అలవాటైపోయింది!" రాచఠీవి రాజసాలుపోయింది.

"అర్థమున్నా అపార్థం చేసుకోవడం రాయః వారికి పరిపాటైపోయింది!" కవి చాతుర్యం కన్నుగీటింది.

రాయలవారు మౌనం వహించడంతో ఆ ప్రసంగం అక్కడికి ఆగిపోయింది. కానీ, కవిగారు ఆ క్షణంనుండే ఆలోచనలో పడి తర్వాత తన ప్రయత్నంలో తాను పడినారు.

ఆ ప్రయత్నంలో భాగంగా ఒకానొకదినం రామలింగ కవిగారు సరాసరి చాకలి రంగడి ఇంటిపావనంచేసినారు. రంగడు చాలా సంబరపడిపోయినాడు. "కాకితో కబురంపితే వచ్చేవాణ్ణి గద సామీ! ఈ పేదోడింటికి తావు రావడవేంటీ?" చేతులు నలుపుకుంటూ నిలబడినాడు రంగడు.

అటు, ఇటు చూసినాడు రామకృష్ణ కవి. ఆ తర్వాత చూపుల్ని ఇంటివైపు మరల్చినాడు. "మా ఆడది ఇంట్లో లేదు సామీ! గాడిద కనిపించకుండాపోతే దాన్నెతుక్కుంటా ఇది పొయ్యింది!"

"రంగయ్యా! నీతో చాలా పెద్దపనిబడి వచ్చినాను."

"ఎంత మాటెంత మాట! మురికి గుడ్డలు పిండుకునే ముదనష్టపోణ్ణి..."

"అవును రంగయ్యా!"

"సెప్పండి సామీ!"

"ఆరు నెలలు నీవు మంగలి మొగం చూడకూడదు!"

"ఓస్! అంతేగదా?" అని తేలిగ్గా నవ్వేసినాడు రంగడు.

"ఆరు నెలల తర్వాత కూడా మోయవలసిన బరువు తక్కువయిందేమీ కాదు. అయినా ఇప్పుడా ప్రసక్తి ఎందుకు. ఆరు నెలల తర్వాతగదా? అప్పుడాలోచిస్తాం!" అని అప్పటి రంగణ్ణి వదిలిపెట్టినాడు రామకృష్ణ కవి...!


ఆరు నెలల కాలం! గడవడం ఎంతసేపు? అనుకుంటూ వుండగానే గడిచిపోయింది. మాటకు విలువ వున్న రోజులవి. పైగా ఆస్థాన కవీంద్రులు తెనాలి రామకృష్ణ కవిగారి ఆదేశం. పోనీ! ఆచరణకు మించిన పనంటేనా? కాదు. అందువల్ల రంగడు తన మాట కాపాడుకున్నాడు. ఆరు నెలల తర్వాత ఒక రోజు రామలింగ కవిగారిని దర్శించుకున్నాడు.

రంగయ్యను చూసేసరికి రామలింగయ్య కన్నుల్లో ఆనందం తొణికిసలాడింది. తృప్తిగా తల పంకిస్తూ, 'నా వెంట రా రంగా!' అంటూ కవిగారు బయల్దేరినారు. కవిగారు ముందు రంగడు వెనుకగానడిచి కోట వెలుపల కొండ దడిలో చిట్టిపొట్టి పొదల మధ్య నిలబడినారు. రంగడి కేమీ అంతుపట్టడం లేదు. అయోమయంగా చూస్తూ నిలబడినాడు.

"రంగయ్యా! జాగ్రత్తగా విను. నా మాటను దక్కిస్తావన్న నమ్మకం నాకుంది. చెప్పినట్లు నడుచుకున్నావో?! అగ్రహారం బహుమానం. అగ్రహానికి గురైనావో శిరచ్ఛేదనం!

రంగడు గడగడ వణికిపోతున్నాడు.

"అంతగా భయపడవలసిన అవసరంలేదు రంగయ్యా!




కొండలంటుకుపొయ్యే పనేం గాదు. నీవు చేయవలసిందంతా తలామొలా అంతా దట్టంగా బూడిద పట్టించుకో! గుడ్డా గుసురు ఏమీ లేకుండా ఈ ప్రాంతంలో ఏ చెట్టుకిందయినా కూర్చో. ఎవరైనా రానీ... ఏమైనా చేయనీ... ఏదైనా మాట్లాడనీ... కన్నులు తెరవకూడదు. పెదవి కదపకూడదు. అంటే... నీవొక మహాయోగివి. నీ లోకంలో నీవువుండిపోవాల్సిందే! ఈ పరీక్షలో నెగ్గినావో అగ్రహారం! మరిచిపోవద్దు. రేపు ఉదయం నేను వచ్చి చూస్తాను. అప్పటికి నీవు ఇక్కడ తయారుగా వుంటావు. తెలిసింది కదా? ఇది మంరొక్కరికి తెలిసిందా? శిరచ్ఛేదనమే!

రామలింగయ్య చాలా గంభీరంగా పలికాడు.

రంగడు చాలా వినయంగా విన్నాడు!

** ** **

"ఈ వేళ రామకృష్ణకవిగారి ఆలస్యానికి కారణం?" ఆ వేళ సభకు ఆలస్యంగా వచ్చిన రామకృష్ణ కవిని రాయలవారు ప్రశ్నించినారు.

రామకృష్ణ కవి సభనంతా ఒక్కసారి కలయచూసినారు. ఆ తర్వాత రాయలవైపు తిరిగినారు. ఏదో ఒక వింత స్ఫూర్తి తన్నావహించినట్టుగా నిమీలితనేత్రుడైనారు. ఆ స్థితిలోనే... అతి మంద్రస్థాయిలో "ఏమని చెప్పమంటారు మహారాజా!" అన్నారు.

"కవీశ్వరులు ఎందుకో సందేహిస్తున్నారు."

"లేదు మహారాజా లేదు. ఈ వేళ ప్రాతఃసమయాన అలవాటు మేరకు బహిర్భూమికి పోయినాను. అక్కడ, అప్పుడు అనుకోని రీతిగా ఒక మహాపురుషుని సందర్శనం లభించింది. ఆ అనుభూతితో శరీరం పరవశించింది. కాళ్ళా ఆడలేదు. ఎంతసేపు నిలబడిపోయానో ఆలస్యం జరిగింది. క్షంతవ్యుణ్ణి!"

"ఏమేమీ! మా సామ్రాజ్యంలో అంతటి మహానుభావులు కాలూనడం... ఇది ముమ్మాటికి శ్రీ వేంకటేశ్వర దివ్యసందర్శనాను ఫలితమే! దీనినిమేమొక శుభ సూచకంగా భావిస్తున్నాం... కవీశ్వరా! వెంటనే ఆ మహాపురుషుని సందర్శనానికి ఏర్పాట్లు చేయండి!"

రాజు తలచుకున్నాడు. ఇంకేం? అంతఃపుర కాంతలు పూజాద్రవ్యాలతో సంసిద్ధులైనారు. రాయలవారు సపరివార సమేతంగా బయల్దేరినారు. రామలింగ కవిగారు దారి చూపుతూ ముందు నడువగా ఆ పవిత్ర స్థలాన్ని చేరుకోవడానికి రాయలవారు పల్లకీ ఎక్కలేదు కానీ, పాదచారి అయినాడు.

పేట దాటినారు. కోట దాటినారు. ఆ పవిత్ర స్థలాన్ని చేరుకున్నారు.

నిశ్చల ధ్యాన సముద్రంలో మునిగి వున్న ఆ దివ్య పురుషుని సందర్శనంతో రాయలు అప్రయత్నంగా చేతులు జోడించినారు.

రామకృష్ణ కవిగారు చిరునవ్వులు చిందిస్తూ అంతఃపురకాంతల నుంచి పూజా ద్రవ్యాల్ని అందుకున్నాడు. భక్తి శ్రద్ధలతో మునిపుంగవుణ్ణి పుష్పమాలాంకృతుణ్ణి చేసినాడు. నారికేళాలు సమర్పించినాడు. కర్పూర హారతులిచ్చినాడు. అటుపై వినయంగా వంగి ఒక పుష్పాన్ని పీకి కన్నుల కద్దుకుని పిలకముడిలో దోపుకున్నాడు.

కవిగారి శిరసున చేరేసరికి దానికి పుష్పయోగం పట్టింది.

కవిగారే అంత భక్తిని ప్రదర్శించినప్పుడు రాయః వారు ఊరుకుంటారా? తాను కూడా ఒక పుష్పాన్ని పీకి కన్నులకద్దుకుని శిరసున ధరించినాడు. అంతే! అందరూ గొర్రెదాటుగా మునిపుంగవుడి మీద పడినారు. ఆ తొక్కులాటలో పూజకోసం తెచ్చిన అసలు పువ్వులు వాళ్ళ కాళ్ళకింద పడి నలిగిపోతున్నాయ్! ఆ స్పృహ వాళ్ళకు లేదు.

ఆ తరువాత కథతో మనకు పనిలేదు.

రామకృష్ణ కవి మేథావి. గొర్రెదాటు తత్త్వాన్ని నిరూపించడానికి రాయలంతటివాణ్ణి తెచ్చి చాకలి కాళ్ళ ముందర పడేసిన నేర్పరి.

తరాలు మారినాయి. తలపులు మారినాయి. శాస్త్ర పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. శాస్త్రీయంగా ఆలోచించే విధానం అలవడింది. పల్లకీలను, గుర్రాలను ఎక్కి తిరగడం, కార్లు, విమానాల వరకు ఎదిగింది. అయితే మనిషిలో ఈ తత్త్వం మాత్రం మారలేదన్న సత్యాన్ని గ్రహించిన నాయకులు మాటలతోనే మసిపూసి మారేడుకాయల్ని చేస్తున్నారు. జనాన్ని ఆడిస్తున్నారు

ఏ మహానుభావుడు అల్లినాడో ఈ కథ. మనిషి తత్త్వం మారదని భవిష్యద్దర్శనం చేసిన అతని దూరదృష్టికి నిదర్శనం. కోనేటి కట్టకాడ నాకు పునర్దర్శనం!

ఈ గొర్రెదాటు తత్త్వం మారేదెప్పుడు? యోగించిన పుష్పాలు నెత్తికెక్కి కులుకుతూ వుండే అసలు పుష్పాల గోడు అర్థమయ్యే దెప్పుడు? ఈ దేశం బాగు పడే దెప్పుడు? పడుకుని ఆలోచిస్తూ వుంటే గుండెలు కుములుతున్నాయి.

ఎప్పుడు చేరినాడో? ఏమో? నా మనవడు చిన్న సైజు బానమీద చేరినాడు. వాడి పని వాడిది. కొళాయి తిప్పేసినాడు. రాయలు సాక్షిగా చెప్తున్నా — అనుభవం అసలు పుష్పమయింది. అనుభూతి పుష్పమయింది!